క్లుప్తంగా

మొక్కజొన్న పంట పరిశీలన



కాకరవాడలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ

ఉయ్యాలవాడ: మండలంలోని ఇంజేడు, కాకరవాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొక్కజొన్న పంటను ఆత్మ వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ పరిశీలించారు. పైరుకు కత్తెర పురుగు ఆశించిందని యాజమాన్య పద్ధతులు పాటించి పంటను కాపాడుకోవాలని రైతులకు సూచించారు. మొక్కజొన్న పంటలో గడ్డి మందు పిచికారీ వాడకాన్ని తగ్గించాలన్నారు. అధికంగా వాడడం ద్వారా కత్తెర పురుగు ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఏఈఓ సునీత, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఉమ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



రుణాలను పంపిణీ చేస్తున్న నాగిని రవిసింగారెడ్డి

బొమ్మలసత్రం: పేద మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడమే శిల్పా మహిళా బ్యాంక్ ధ్యేయమని బ్యాంక్ చైర్‌పర్సన్ నాగిని రవిసింగారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక శిల్పా సేవా సమితి కార్యాలయంలో పేద మహిళలకు రుణాల పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. 176 మంది మహిళలకు రూ.25.63 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గత 13 ఏళ్లుగా మహిళా సహకార్ బ్యాంకు ద్వారా అతి తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తున్నట్లు వివరించారు. మహిళా సహకార్ ద్వారా అనేక రకాల చేతి వృత్తులు, ఇతర కార్యక్రమాలు అందరినీ ఆకర్షిస్తున్నాయన్నారు. బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీలా, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాశిరెడ్డినాయన జయంతి



ప్రత్యేక అలంకరణలో కాశిరెడ్డినాయన

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కల్పనా సెంటర్‌లో వెలసిన ఆశ్రమంలో మంగళవారం సాయంత్రం కాశిరెడ్డి నాయన జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ, జలాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం విష్ణు సహస్ర నామావళి, అష్టోత్తర శతనామావళి నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. వేదపండితులు సుబ్బాశాస్త్రి, ఆశ్రమ గౌరవాధ్యక్షుడు డాక్టర్ వై.గోపాల్‌రెడ్డి, చక్రపాణి, ఈశ్వరరెడ్డి, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.


పశువుల పాక దగ్ధం



పూర్తిగా కాలిపోయిన గుడిసె వద్ద బాధితుడు

రుద్రవరం: మండలంలోని చిలకలూరు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో వెంకటరమణకు చెందిన పశువులపాక దగ్ధమైంది. రూ.2 లక్షల విలువ చేసే గొర్రెలు, పొట్టేళ్లకు తీవ్ర గాయాలైనట్లు యజమాని వాపోయారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: రైతులు పంటలకు విచక్షణారహితంగా రసాయన ఎరువులను వినియోగించవద్దని ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని చిత్రేణిపల్లెలో జరుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరిసాగులో రెండో, మూడో కోటాలో కాంప్లెక్స్ ఎరువులను వాడవద్దని సూచించారు. పంట నమోదు అనంతరం ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. ఏఓ నాగేంద్రప్రసాద్, ఏఈఓ రాజు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడాలి

- అధికారుల నిర్లక్ష్యంపై సభ్యుల ఆగ్రహం
- అజెండాలోని 24 అంశాలకు కౌన్సిల్ ఆమోదం



సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న అధికారుల తీరులో మార్పు రాకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ మాబున్నిసా కమిషనర్‌కు సూచించారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన 24 అంశాలను కౌన్సిల్ ఆమోదించడం జరిగిందన్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నాయని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ సుందరీకరణ పనులపై పునఃపరిశీలన చేయాలని కో–ఆప్షన్ సభ్యుడు పడకండ్ల సుబ్రమణ్యం కోరారు. ఇటీవల మున్సిపల్ కార్యాలయం వద్ద మాజీ సైనికుడు మృతి చెందిన ఘటనపై, అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మానవతా దృక్పథంతో బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు ఆమోద తీర్మానాన్ని సిఫార్సు చేసి ప్రతిపాదన చేయాలని దేశం సులోచన కోరారు. మున్సిపల్ కార్యాలయం తరఫున దౌలత్‌ఖాన్ కుటుంబ సభ్యులను కమిషనర్ క్షమాపణ కోరారు. మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్ రెడ్డి తనవంతుగా దౌలత్‌ఖాన్ కుటుంబానికి సాయం అందిస్తారని తెలియజేశారని కౌన్సిలర్ దేశం సులోచన చెప్పారు. మున్సిపల్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. పుర ప్రజల నుంచి రూ.30 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయని, స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి వాటిని వసూలు చేస్తామని పేర్కొన్నారు. పట్టణంలో వీధికుక్కలు, దోమలు, కోతుల బెడద సమస్యలు పరిష్కరించాలని కౌన్సిలర్లు కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పశుసంపద అభివృద్ధికి కృషి



పాడి పశువులకు చికిత్స చేస్తున్న డాక్టర్

శిరివెళ్ల: పశు సంపద అభివృద్ధికి కృషి చేస్తున్నామని పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గిద్దయ్య అన్నారు. మంగళవారం కోటపాడు, వీరారెడ్డిపల్లెలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23 నుంచి 31వ తేదీ వరకు ప్రతి పంచాయతీలో పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. పశువులకు బహు వార్షిక పశు గ్రాసం పెంపునకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందన్నారు. రైతులకు మినీ గోకులాలు మంజూరు చేసినట్లు చెప్పారు. శిబిరాలలో 69 మంది రైతులకు చెందిన గేదెలు, గొర్రెలు, మేకలు, దూడలకు గర్భధారణ సూదులు, బొబ్బవ్యాధి నివారణ టీకాలు, డీవార్మింగ్, నట్టల నివారణకు వైద్యం చేశారు. మండల పశువైద్యాధికారి శ్రీనివాసులు, బీఎల్‌ఓ సుధాకర్, వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

పాడితో జీవనోపాధి

ఉయ్యాలవాడ: పాడి కుటుంబానికి జీవనోపాధిని ఇస్తుందని పాడిరైతులు అప్రమత్తంగా ఉంటూ జీవాలకు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యాధికారిణులు శ్రీలక్ష్మి, నాగశైలజ సూచించారు. మంగళవారం మండలంలోని ఆర్.పాంపల్లె, పడిగెపాడు గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. 225 పశువులకు వైద్య చికిత్సలు చేపట్టారు. 25 పాడి గేదెలకు గర్భకోశ వ్యాధులకు టీకాలు వేశారు. 520 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు తాపించారు. పశువులకు సోకే వ్యాధులపై సంబంధించి పెంపకందారులకు అవగాహన కల్పించారు.

ఏఈగా నాగార్జున

శిరివెళ్ల: ట్రాన్స్‌కో మండల ఏఈగా నాగార్జున నియమితులయ్యారు. గత ఏఈ రామగోవిందరెడ్డి రెండేళ్ల కితం వైఎస్సార్ జిల్లా ముద్దనూరు థర్మల్ కేంద్రానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సబ్ ఇంజనీర్ మల్లికార్జున ఇన్‌చార్జ్ ఏఈగా బాధ్యతలు నిర్వహించారు. ఈ క్రమంలో నెల్లూరులో జేఈగా పనిచేస్తున్న నాగార్జున పదోన్నతిపై శిరివెళ్లకు ఏఈగా వచ్చారు.

జెడ్పీ నిధుల మంజూరు

శిరివెళ్ల: మండలానికి తాజాగా రూ.15 లక్షల జెడ్పీ టీసీ నిధులు మంజూరయ్యాయని జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌నాయక్ మంగళవారం తెలిపారు. నిధులతో స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని 3వ గ్రామ సచివాలయం ప్రాంతంలో రెండు అంతర్గత సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణాలు మొదలు పెట్టనున్నట్లు చెప్పారు. గతంలో గోవిందపల్లెలో రూ.30 లక్షలు, శిరివెళ్లలో రూ.35 లక్షలు, వెంకటాపురంలో రూ.12 లక్షలు, గుంప్రమాన్‌దిన్నెలో రూ.10 లక్షలతో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

రేపు జాబ్‌మేళా

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30వ తేదీన జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) ఆధ్వర్యంలో రామ్‌కో సిమెంట్ కంపెనీ వారు 25 పోస్టుల భర్తీ కోసం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ, కనీసం 60 శాతం మార్కులతో పాసై ఉండి, డిగ్రీలో కెమిస్ట్రీ సబ్జెక్టు కలిగి, ప్రతి సెమిస్టర్ మొదటి విడతలో పాసై 2023–24, 2025 సంవత్సరాల్లో డిగ్రీ పూర్తి చేసిన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.27 వేల నుంచి రూ.36 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆన్‌లైన్ పరీక్ష, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ తర్వాత ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ఎంపికైన వారికి వసతి కల్పిస్తారని చెప్పారు. అర్హులైన వారు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు రెండు సెట్‌లు తీసుకొని 30వ తేదీ ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. మరింత సమాచారం కోసం జేకేసీ కో–ఆర్డినేటర్ పార్వతి సెల్ 97033 77803 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

30 యాక్టును వెంటనే ఎత్తివేయాలి



మాట్లాడుతున్న రమేష్‌కుమార్

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పరిధిలో 30 యాక్ట్‌ను అమలుచేయడాన్ని సీపీఎం జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏఎస్పీ మందజావళి ప్రకటన చేస్తూ నేటి నుంచి నంద్యాల పరిధిలో 30 యాక్ట్ అమలులో ఉంటుందని, ఎలాంటి ప్రదర్శనలు, ఆందోళనలు చేయరాదని వెల్లడించారన్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ప్రజాస్వామిక పద్ధతికి వ్యతిరేకమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించడమేనని అన్నారు. ప్రజలు, ప్రజా సంఘాల సమస్యలపై అధికారులకు విన్నవించినా పరిష్కారం కానందునే ఆందోళనలు, ఉద్యమాలు చేస్తున్నామన్నారు. ఉద్యమాల వల్ల శాంతి భద్రతలకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేదని, అయినా 30 యాక్ట్ పెట్టడం ప్రజా సమస్యల పరిష్కారాన్ని అడ్డుకోవడమేనన్నారు. వెంటనే 30 యాక్టును నిలుపుదల చేయాలని కోరారు. సీపీఎం జిల్లా నాయకులు రామచంద్రుడు, పుల్లా నరసింహ, లక్ష్మణ్, బాలవెంకట్, తదితరులు పాల్గొన్నారు.

దౌలత్‌ఖాన్ కుటుంబాన్ని ఆదుకోవాలి



కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కార్గిల్ వీరుడు, మాజీ సైనికుడు దౌలత్‌ఖాన్ కుటుబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని న్యాయ పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా నిరసన ప్రదర్శన చేపట్టారు. కమిటీ సభ్యులు అబ్దుల్‌సమ్మద్, మస్తాన్‌వలి, బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ సిబ్బంది, కమిషనర్ వేధింపుల వల్లే దౌలత్‌ఖాన్ మృతి చెందారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలన్నారు. నంద్యాల మున్సిపాలిటీ రాష్ట్రంలోనే అవినీతిలో మొదటి స్థానంలో ఉందని విమర్శించారు. మంత్రి ఫరూక్ జోక్యం చేసుకొని మున్సిపల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమిటీ కో–కన్వీనర్ సుహిల్, కేపే ఖాన్, మస్తాన్‌ఖాన్, మజీద్‌ఖాన్, అబ్దుల్‌కలాం, ముస్లిం సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పరికరాలు అందించాలి

నంద్యాల(అర్బన్): దివ్యాంగులకు సహాయ పరికరాలు అందించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్‌వలి కోరారు. మోటరేజ్ బ్యాటరీ సైకిల్, ట్రైసైకిల్స్, వీల్ చైర్స్, చంక కర్రలు అందేలా చూడాలంటూ మంగళవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఎంపీ బైరెడ్డి శబరికి దివ్యాంగులు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, ఎల్లయ్య, ఖాదర్‌బాషా, బాలతిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

హైవే పనుల నిలుపుదల

నంద్యాల(అర్బన్): కల్వకుర్తి వయా నంద్యాల–జమ్మలమడుగు హైవే ఎక్స్‌టెన్షన్ పనులు కొంత సమయం వరకు నిలుపుదల చేయాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అధికారులను కోరారు. భూములు కోల్పోతున్న రైతులకు ఇబ్బందులు లేకుండా ఎక్స్‌టెన్షన్ పనులు జరిగేలా త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్గదర్శకాలు ఇవ్వనున్నాయన్నారు. ఎక్స్‌టెన్షన్ పనుల్లో భాగంగా హైవే అధికారులు మంగళవారం నిర్వహిస్తున్న పెగ్గుమార్క్ పనులను నిలుపుదల చేయించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో వేసిన ఎక్స్‌టెన్షన్‌లో పేద రైతులు భూములు కోల్పోతున్నారన్నారు. మార్గదర్శకాల అనంతరం పనులు కొనసాగించవచ్చని సూచించారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ





పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి,కాళికాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామికి మంగళవారం వేదపండితుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. తెల్లవారుజామునే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం 108 బంగారు పుష్పాలతో అష్టోత్తర నామావళి నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో అమ్మవారికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించి ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహా మంగళ హారతులు ఇచ్చారు.

ప్రతి కొనుగోలుకు రసీదు ఇవ్వాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి

రుద్రవరం: రసాయన ఎరువులు, మందులు కొనుగోలుపై రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని ఆలమూరులో ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఎరువులను ప్రభుత్వం సూచించిన ధరకే విక్రయించాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌లో వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఈ–పాస్ యంత్రాలను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏఓ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగ సాధనలో ముందుండాలి



మాట్లాడుతున్న ముస్తాక్‌అహమ్మద్

నంద్యాల(అర్బన్): డీఎస్సీ ఉచిత శిక్షణను పూర్తి చేసుకున్న నిరుద్యోగులు ఉద్యోగ సాధనలో ముందుండాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ముస్తాక్ అహమ్మద్ సూచించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన డీఎస్సీ 60 రోజుల ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమంలో ముస్తాక్ అహమ్మద్ మాట్లాడుతూ.. పేరొందిన విషయ నిపుణులచే 60 రోజుల పాటు విద్యార్థులకు ఉచిత శిక్షణను అందించామన్నారు. ప్రతి విద్యార్థికి నెలకు రూ.1500 చొప్పున రెండు మాసాలకు రూ.3 వేలు ప్రోత్సాహకం అందించినట్లు చెప్పారు. ఉచిత మెటీరియల్ అందుకున్న విద్యార్థులు ఉద్యోగ సాధనే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. శిక్షణా నిపుణులు జైనుల్లా వుద్దీన్, ఫారుక్, షబ్బీర్‌బాషా, గోవర్ధన్, గోపాల్, వెంకటపతి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక



కావ్యశ్రీ

దొర్నిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కావ్యశ్రీ 28వ జాతీయ స్థాయి జూనియర్ సెపక్‌తక్రా క్రీడలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాసరావు మంగళవారం మాట్లాడుతూ.. ఈనెల 17, 18 తేదీల్లో ప్రకాశం జిల్లా పొదిలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాలలో జరగనున్న జాతీయ స్థాయిలో పాల్గొననున్నట్లు చెప్పారు. ఫిజికల్ డైరెక్టర్ దేవేంద్రను అభినందించి జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

నీటి ఎద్దడి రానివ్వొద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ నాయక్ వసీం

శిరివెళ్ల: రానున్న వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ నాయక్ వసీం సూచించారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తమ గ్రామాలలో నెలకొన్న వివిధ సమస్యలు పరిష్కరించాలని సభలో ప్రజా ప్రతినిధులు ఏకరువు పెట్టారు. కామినేనిపల్లె సర్పంచు మేర్వ చిన్న నరసింహారెడ్డి మాట్లాడుతై.. తమ పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి లేక పారిశుద్ధ్యం లోపించిందని, మూడు నెలలుగా గ్రీన్ అంబాసిడర్లు లేరన్నారు. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు లేవన్నారు. గ్రామ పంచాయతీకి ఇన్‌చార్జి కార్యదర్శిని నియమించామని త్వరలోనే సమస్యలను పరిష్కారిస్తామని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప బదులిచ్చారు. యర్రగుంట్ల సర్పంచు అయ్యలూరి సుభహాన్ మాట్లాడుతూ.. జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ మోటార్‌ను తొలగించారని దీంతో ఎల్లమ్మ పేట ప్రజలకు నీటి సమస్య తలెత్తిందన్నారు. సమస్యను గత సమావేశంలోనే ప్రస్తావించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి సమీపిస్తోందని సమస్యను పరిష్కరించాలని కోరారు. రైతులతో విత్తనాల ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ కమతం జయరామిరెడ్డి కోరారు. తమ పంచాయతీలో మినీ వాటర్ ట్యాంక్‌లకు పైకప్పులు లేవని యర్రగుంట్ల ఎంపీటీసీ జయరామిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాలలో కుక్కల బెడద అధికంగా ఉందని సర్పంచులు లేవనెత్తారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల పనితీరును వివరించారు. ఏఓ సుధాకర్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి నుంచి విడతల వారీగా సాగునీరు వస్తుందని, వరి సాగుచేయవద్దని చెప్పినా రైతులు సాగు చేశారన్నారు. హౌసింగ్ ఏఈ అహమ్మద్ బాషా మాట్లాడుతూ.. ప్రస్తుతంకు పాత స్కీంలోనే ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు వస్తున్నాయన్నారు. మండలంలో 924 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 309 ఇళ్లు బేస్‌మెంట్ దశలో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలేంగేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. జలజీవన్ పథకం కింద ప్రతి గ్రామంలో అదనపు ట్యాంక్‌లు, పైప్‌లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌నాయక్, ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషాద్రి

ఆళ్లగడ్డ: క్షణికావేశంలో నేరాలకు పాల్పడుతుంటారని, ప్రస్తుతం జైలులో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న వారు సత్ప్రవర్తనతో జీవించేందుకు ప్రయత్నించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి అన్నారు. స్థానిక ఉప కారాగారంలోని న్యాయ సహాయ కేంద్రాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న వారితో మాట్లాడి ఏఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఎప్పటినుంచి రిమాండ్‌లో ఉంటున్నారు. జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఆర్థిక స్తోమత లేని రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అర్హత ఉన్న ఖైదీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాధితులను ఆదుకోవాలి



క్షతగాత్రులను పరామర్శిస్తున్న నాగినిరవిసింగారెడ్డి

బొమ్మలసత్రం/గోస్పాడు: గ్యాస్ విస్ఫోటనం చెంది మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి సతీమణి నాగిని రవిసింగారెడ్డి కోరారు. శుక్రవారం వేకువజామున నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో గ్యాస్ విస్ఫోటనం ప్రమాదంలో గాయపడి స్థానిక జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఆమె పరామర్శించారు. ఆర్థిక సాయం అందించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ.. గ్యాస్ పేలుడు ఘటన జరగటం దురదృష్టకరమన్నారు. బాధితులంతా రోజువారీ కూలి పనిచేసి జీవనం గడిపేవారన్నారు. ఈ ప్రమాదంలో వృద్ధురాలిని, బాలుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. మరో ఆరుగురు గాయపడ్డారని, ప్రభుత్వం స్పందించి బాధితులను ఆదుకోవాలని కోరారు. ఆసుపత్రి సూపరింటిండెంట్‌తో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, ఆదిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి, సుబ్బన్న తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో సోషల్ ఆడిట్ బృందం తనిఖీ



చాగలమర్రి కేజీబీవీలో విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సోషల్ ఆడిట్ అధికారులు

చాగలమర్రి: మండల కేంద్రంలోని కేజీబీవీ, బాలికల ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు సోషల్ ఆడిట్ బృందం అధికారులు ఏ.నాగేశ్వర రెడ్డి, జి.జ్ఞానేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలలో స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్వహణ, అలాగే తాగునీటి సౌకర్యం, వసతి, భోజన సదుపాయం, మెనూ తదితర వాటిని పరిశీలించి, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో విద్యాబోధన, సదుపాయాల గురించి అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు, విద్యాబోధన, మధ్యాహ్న భోజన నిర్వహణ తదితర వాటిని పరిశీలించి విద్యార్థినులు, ఉపాధ్యాయుల హాజరు, వివిధ రికార్డులను తనిఖీ చేశారు. కేజీబీవీ ఎస్‌ఓ సునీత పాఠశాలకు ప్రహరీ గోడ, మెయిన్ గేటు నిర్మించాలని కోరారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి సమస్యలపై మాట్లాడుతూ.. వర్షాకాలంలో వర్షపు నీరు పాఠశాలలోకి చేరడంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని కోరడంతో ఆడిట్ అధికారులు సానుకూలంగా స్పందించారు.

నట్టల నివారణ మందు పంపిణీ



జీవాలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారి సాయిబాబా

చాగలమర్రి: మండలంలోని తోడేండ్లపల్లె గ్రామంలో మంగళవారం 1050 జీవాలకు నట్టల నివారణ మందు తాపించినట్లు ముత్యాలపాడు పశువైద్యాధికారి సాయిబాబా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరంలో గ్రామంలోని 7 పశువులకు గర్భకోశ వ్యాధికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసి, 45 పెద్ద పశువులకు, 90 దూడలకు, 950 జీవాలకు నట్టల నివారణ మందును తాపించడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలకు పాడి రైతులు నుంచి మంచి స్పందన ఉందని, వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మహబూబ్ షరీఫ్, రైతులు పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల రద్దీ

మహానంది: మహానందిలో భక్తులరద్దీ కొనసాగుతుంది. పలు ప్రాంతాలకు నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి కనిపించింది.

మహానందీశుడికి ఏకాంతసేవ పూజలు

మహానందీశుడి దంపతులకు మంగళవారం రాత్రి ఏకాంతసేవ పూజలు వైభవంగా జరిగాయి. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, శాంతారాంభట్, హనుమంతుశర్మలు స్థానిక యాగశాలలో పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. పలు ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవారి ఏకాంత సేవ పూజలు తిలకించారు.

కూలిన బ్రిడ్జి సైడ్‌వాల్



సలీంనగర్‌లో కూలిపోయిన సైడ్‌వాల్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని సలీంనగర్ వద్ద చామకాల్వపై నిర్మించిన బ్రిడ్జి సైడ్‌వాల్ ఒక్కసారిగా మంగళవారం కూలిపోయింది. 2023లో దాదాపు రూ.80లక్షల మున్సిపాలిటీ నిధులు వెచ్చించి అప్పటి ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభించారు. దీంతో పట్టణంలోని దేవనగర్, వీసీ కాలనీ, టీచర్స్ కాలనీ, హనీఫ్‌నగర్, శ్యాంనగర్ తదితన కాలనీల ప్రజలు తక్కువ సమయంలో మున్సిపల్ కార్యాలయానికి చేరుకునేందుకు వీలైంది. అంతకు మునుపు శ్యాంనగర్ వద్ద రూ.90 లక్షలతో బ్రిడ్జిని నిర్మించి అందరి మన్ననలు అందుకున్నారు. చామకాల్వపై నిర్మించిన వంతెనలతో రాకపోకలు సులభతరం కావడంతో శిల్పా రవి చేసిన పనులను ప్రజలు హర్షించారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం పట్టణాభివృద్ధికి నిధులు మంజూరు కావడంతో కాంట్రాక్టర్లు తూతూ మంత్రపు పనులకు శ్రీకారం చుట్టారు. శ్యాంనగర్, దేవనగర్ నుంచి వచ్చే మురుగు నీటిని చామకాల్వలోకి మళ్లించేందుకు అధికారులు సలీంనగర్ బ్రిడ్జి సమీపంలో డ్రైనేజీ కాల్వ ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. కాల్వ ఏర్పాటులో భాగంగా లోతైన గుంతలు తీయడంతో వంతెన సైడ్‌వాల్ కూలిపోయింది. ఎవరి మీదనో నెపం వేసేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు దురాలోచనకు తెరలేపారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించిన బ్రిడ్జి సమీపంలో లోతైన గుంతలు తీయడం సరైంది కాదంటూ పలువురు స్థానికులు పేర్కొంటున్నారు.